# నీళ్లిచ్చి కన్నీళ్లు తుడిచింది కేసీఆరే

- కాలంతో పోటీపడి కాళేశ్వరం నిర్మించారు
- వరప్రదాయినిపై కాంగ్రెస్, బీజేపీ దుష్ప్రచారం
- మేడిగడ్డలో 2 పిల్లర్లు కుంగితే రాద్ధాంతం
- కమిషన్, విచారణ పేరిట కపట నాటకాలు
- నాటి ట్యాగ్‌లైన్ నీళ్లు, నిధులు, నియామకాలు నేడు నిందలు, దందాలు, చందాలే ట్యాగ్‌లైన్
- కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామరక్ష
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జూన్ 7 (నమస్తేతెలంగాణ): 'గోదావరి, కృష్ణా నదుల్లోని ప్రతి బొట్టును ఒడిసిపట్టి ఒక్క చుక్కను కూడా వదలకుండా కాలంతో పోటీపడి కాళేశ్వరం నిర్మించి, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలు, సీతారామ ప్రాజెక్టులను 90 శాతం పూర్తిచేసి తెలంగాణ ప్రజల కన్నీళ్లు తుడిచింది కేసీఆరే' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరంపై కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కై నిస్సిగ్గుగా దుష్ప్రచారం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. దున్నపోతు ఈనిందంటే దూడను కట్టేయమన్న చందంగా రెండు పార్టీలు కూడబలుక్కొని కుట్రలకు తెగబడుతున్నాయని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాళేశ్వరంలోని 100 కాంపోనెంట్లలో మేడిగడ్డ ఒకటని, ఈ ప్రాజెక్టులోని రెండు పిల్లర్లలో ఒక్కచోట పగుళ్లు వస్తే అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడారు. 'నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం ట్యాగ్‌లైన్ నీళ్లు, నిధులు, నియామకాలు. వీటిని కేసీఆర్ తన పదేండ్ల పాలనలో సంపూర్ణంగా నెరవేర్చారు. కానీ నేటి కాంగ్రెస్ పాలనలో ఆ ట్యాగ్‌లైన్ మాయమైంది. బీఆర్ఎస్‌పై నిందలు, కాంట్రాక్టర్లు, బిల్డర్ల నుంచి దందాలు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌కు చందాలు పంపడం' అని ఎద్దేవా చేశారు. 'కాళేశ్వరం కమిషన్ విచారణ పేరిట బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ బురద జల్లుతున్న తరుణంలో కాళేశ్వరంపై ప్రజల ముందు వాస్తవాలు పెట్టాలని, దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలన్న ఉద్దేశంతో కేసీఆర్ పాలనలో కోటి ఎకరాల మాగాణం సృష్టికర్త, మిగతా మంత్రుల కంటే గొప్పగా పనిచేసిన నేత, ఉద్యమ బిడ్డ, నీళ్ల వినియోగంపై సంపూర్ణ అవగాహన ఉన్న మాజీ మంత్రి హరీశ్‌రావుతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ స్లైడ్స్ చూస్తుంటే సీడబ్ల్యూసీ మాజీ సభ్యుడు, కేసీఆర్‌కు నీటిపారుదల సలహాదారుడిగా మనందరికీ దిశానిర్దేశం చేసిన విద్యాసాగర్‌రావు గుర్తుకు వస్తున్నారని అన్నారు. ఆయన 'నీళ్లు-నిజాలు' అనే పుస్తకం రాసి నదీజలాల వినియోగంలో దశాబ్దాలుగా కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ తెలంగాణకు చేసిన అన్యాయాలను ఎలుగెత్తి చాటారని కొనియాడారు.

> గుజరాత్‌లోని మార్బీ బ్రిడ్జి కూలిపోయి 140 మంది మరణించినా, బీహార్‌లో నాలుగు రోజులకో బ్రిడ్జి కూలిపోయినా ఎన్డీఎస్ఏగానీ, ఏ కేంద్ర ఏజెన్సీగానీ స్పందించలేదు. కాంగ్రెస్ హయాంలో సుంకిశాల కూలిపోయి రూ. 100 కోట్ల నష్టం జరిగినా ఎన్డీఎస్ఏ రాదు. కాంగ్రెస్ అవినీతి కోసం చేపట్టిన ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు టన్నెల్ కూలిపోయి ఎనిమిది మంది మరణించినా సీఎం రేవంత్ మాట్లాడరు.
> -కేటీఆర్

### మార్బీ కూలిపోతే ఎన్డీఎస్ఏకు ఎందుకురాలె?

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ రిజర్వాయర్‌లో రెండు పిల్లర్లకు పగుళ్లు వస్తే సీఎం రేవంత్, బీజేపీ కలిసి ఊరూవాడా ఏకం చేసి ఏదో జరిగిపోయినట్టు ఎన్డీఎస్ఏను రప్పించి రాద్ధాంతం చేశాయని కేటీఆర్ దుయ్యబట్టారు. 'గుజరాత్‌లోని మార్బీ బ్రిడ్జి కూలిపోయి 140 మంది మరణించినా, బీహార్‌లో నాలుగు రోజులకో బ్రిడ్జి కూలిపోయినా ఎన్డీఎస్ఏగానీ, ఏ కేంద్ర ఏజెన్సీగానీ స్పందించలేదు. 140 మంది చావులకు కారణమెవరో తేల్చలేదు. అదే కాంగ్రెస్ హయాంలో తెలంగాణలో సుంకిశాల కూలిపోయి రూ. 100 కోట్లు నష్టం జరిగినా ఎన్డీఎస్ఏ రాదు. కాంగ్రెస్ అవినీతి కోసం చేపట్టిన ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు టన్నెల్ కూలిపోయి ఎనిమిది మంది మరణించినా సీఎం రేవంత్ మాట్లాడరు. మంత్రి ఉత్తమ్ నోరు మెదపరు. కేంద్ర పెద్దలు పట్టించుకోరు. వట్టెం పంప్‌హౌస్ మునిగిపోయినా దాని గురించి మాట్లాడేటోళ్లు లేరు. పెద్దవాగు రెండుసార్లు కొట్టుకుపోయినా అడిగే నాథుడు లేడు' అని విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం విషయంలో మాత్రం ఇంకోవిధంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. 'ఎన్డీఏ ఆఫీసులో వండి వార్చి రిపోర్టును రూపొందించి ప్రజలను భ్రమింపజేసే ప్రయత్నం జేసిన్రు' అని ఆగ్రహం వ్యక్తంచేశారు.

### కమిషన్ పేరిట నాటకాలు

కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై కాళేశ్వరం కమిషన్ పేరిట నాటకాలాడుతున్నాయని కేటీఆర్ ఫైర్ అయ్యారు. నీళ్లిచ్చిన కేటీఆర్ మీద అభాండాలు వేస్తున్నాయని దుయ్యబట్టారు. ఆ విషయంలో వాస్తవాలు బయటపెట్టేందుకే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని హరీశ్‌రావును కోరానని తెలిపారు. 'ఇక్కడే కాదు అమెరికాలోని డాలస్‌లో సైతం అక్కడి వారు కూడా వాస్తవాలు చెప్పాలని కోరుతున్నారు. సోషల్ మీడియాలో ప్రచారం చేస్తామంటున్నారు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై తెలంగాణ బొండిగ పిసికేందుకు చేసే ప్రయత్నాలను తిప్పికొడతమని చెబుతున్నరు' అని గుర్తుచేశారు. తొమ్మిది నెలల క్రితం మేడిగడ్డను సందర్శించి వాస్తవాలు మీడియాకు చూపించామని పేర్కొన్నారు. మేడిగడ్డను రిపేర్ చేయించాలని ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదికను సైతం చూపించామని తెలిపారు. కట్టిన కంపెనీ మరమ్మతులు చేయించాలని ఎన్డీఎస్ఏ యాక్ట్‌లో స్పష్టంగా ఉన్నా కాంగ్రెస్ నాయకులు నోరు మెదపడం లేదని మండిపడ్డారు.

> కాళేశ్వరం ప్రాజెక్టులోని వంద కంపోనెంట్లలో మేడిగడ్డ ఒకటి. అందులోని మూడు బరాజ్‌లలో 370 పిల్లర్లు ఉంటే రెండు పిల్లర్లలో ఒక దగ్గర పగుళ్లు వచ్చినయ్. దాన్ని పట్టుకొని దున్నపోతు ఈనిందని కాంగ్రెసోడు అంటే దూడను కట్టెయ్యమన్నట్టు బీజేపోడు రెండు రోజుల్లో ఎన్డీఎస్ఏను పంపిండు.
> -కేటీఆర్


### ఎన్డీఎస్ఏ రిపోర్ట్‌ను ఎల్అండ్‌టీ తిరస్కరించింది

కాళేశ్వరం కట్టిన ఎల్అండ్‌టీ ఎన్డీఎస్ఏ రిపోర్ట్‌ను తిరస్కరించిందని, ఇది చెత్త బుట్టలో పడేయడానికి తప్ప ఎందుకూ పనికిరాదని తేల్చిచెప్పిందని గుర్తుచేశారు. ఎల్అండ్‌టీ పనికిరానిదైతే కాంగ్రెస్ కార్యాలయాన్ని ఎందుకు కట్టించావని రేవంత్‌ను ప్రశ్నించారు. ఢిల్లీ కాంగ్రెస్ కార్యాలయాన్ని సైతం తెలంగాణ నుంచి పోయిన మూటల నుంచే కట్టించారని, ఈ వాస్తవాలు ప్రజలకు తెలుసని చురకలంటించారు.

### ఏపీ అక్రమ ప్రాజెక్టులపై ఎందుకు స్పందించరు?

గోదావరి నీటిని చెరబట్టేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టును తెరపైకి తెచ్చిందని కేటీఆర్ ఆరోపించారు. అనుమతుల్లేని ప్రాజెక్టుతో తెలంగాణకు తీరని అన్యాయం జరుగుతుందని తెలిసినా ముఖ్యమంత్రి రేవంత్ ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే చోద్యం చూడడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. ఈ విషయంలో అటు కేంద్రం కూడా నోరు తెరవడం లేదని విమర్శించారు. ఏ నాటికైనా కేసీఆర్ నాయకత్వమే తెలంగాణ ప్రజలకు, రైతాంగానికి శ్రీరామరక్ష అని స్పష్టంచేశారు.

## లోకం పోకడ




ఇది చేపల క్యూ..
మంత్రి పదవుల కోసం క్యూ అక్కడయ్యా!

## వానా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 41.9°c | 25.5°c |
| మెదక్ | 40.4°c | 28.9°c |
| వరంగల్ | 40.0°c | 27.0°c |
| ఖమ్మం | 40.0°c | 28.0°c |
| రంగారెడ్డి | 39.5°c | 22.5°c |
| నల్లగొండ | 39.0°c | 24.8°c |
| హైదరాబాద్ | 38.2°c | 26.3°c |
| నిజామాబాద్ | 38.0°c | 27.4°c |
| కరీంనగర్ | 38.0°c | 29.0°c |
| మహబూబ్‌నగర్ | 36.0°c | 25.0°c |

## బీఆర్ఎస్‌కు జలపాఠాలు.. కాంగ్రెస్‌కు చురకలు!

**కాళేశ్వరంపై విమర్శలను తిప్పికొట్టిన హరీశ్**

**ప్రజెంటేషన్‌కు తరలొచ్చిన గులాబీదళం**

హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ తెలంగాణ భవన్ వేదికగా కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో కాంగ్రెస్‌కు తనదైన శైలిలో చురకలు అంటించారు. మరోవైపు బీఆర్ఎస్ శ్రేణులకు జలపాఠాలను బోధించారు. ప్రాజెక్టుపై హస్తం పార్టీ చేస్తున్న ప్రచారాన్ని ఆధారాలతో సహా విడమరిచి చెప్పారు. ప్రాజెక్టుపై కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు చేస్తున్న కుట్రలను గులాబీ శ్రేణులకు విడమరచి చెప్పారు. ఈ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌కు బీఆర్ఎస్ నాయకులు భారీగా తరలివచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, రాష్ట్ర నాయకులు, వివిధ చానళ్లలో చర్చల్లో పాల్గొనే పార్టీ ప్రతినిధులు, బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ భారీగా తరలివచ్చారు. ప్రాజెక్టుపై ఇచ్చిన ప్రజెంటేషన్‌ను ఆద్యంతం ఆసక్తిగా విన్నారు. సీఎంగా కేసీఆర్ కృషిని, కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాశస్త్యాన్ని, సాధించిన ఫలితాలను హరీశ్‌రావు వివరిస్తుంటే కరతాళ ధ్వనులతో హోరెత్తించారు. వివరాలను నోట్ చేసుకున్నారు. ప్రజెంటేషన్ అనంతరం హరీశ్‌రావును వారంతా ప్రత్యేకంగా అభినందించారు.



యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట బీఆర్ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న టెస్కాబ్ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంగిడి మహేందర్‌రెడ్డి

## 'గంధమల్ల', యాదాద్రి వైద్యకళాశాల కేసీఆర్ కలల ప్రాజెక్టులే

- ఆయన హయాంలోనే అంకురార్పణ
- కేసీఆర్‌ను తిట్టేందుకే సీఎం సభ పెట్టిండు
- టెస్కాబ్ మాజీ వైస్‌చైర్మన్ మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, జూన్ 7 : అపర భగీరథుడు, రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ ఆలోచనలో నుంచి పుట్టినవే గంధమల్ల జలాశయం, యాదాద్రి వైద్యకళాశాల అని టెస్కాబ్ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంగిడి మహేందర్‌రెడ్డి స్పష్టంచేశారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం 16వ ప్యాకేజీలో లింక్ ప్రాజెక్టు టెయిల్‌ఎండ్‌లో భాగంగా ఆలేరు నియోజకవర్గానికి సాగుజలాలు అందించాలన్న లక్ష్యంతో 2019 ఫిబ్రవరిలో 9.8 టీఎంసీల సామర్థ్యంతో గంధమల్ల జలశయాన్ని ప్రతిపాదించారని గుర్తుచేశారు. భూసేకరణ సమస్యతో 4.2 టీఎంసీలకు కుదించడంతోపాటు గ్రామస్థుల కోరిక మేరకు రీడిజైన్ చేసి 1.41 టీఎంసీలకు కుదించి నిర్మాణానికి పరిపాలనా అనుమతులతోపాటు నిధులు మంజూరైనట్టు స్పష్టంచేశారు. శనివారం యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట బీఆర్ఎస్ కార్యాలయంలో మీడియాతో మహేందర్‌రెడ్డి మాట్లాడారు. తుర్కపల్లి మండలం తిరుమలాపూర్‌లో జరిగిన రేవంత్ సభ కేసీఆర్‌ను తిట్టేందుకే పెట్టినట్టు ఉందని, ఆ సభతో నియోజకవర్గానికి ఒరిగిందేమీలేదని మండిపడ్డారు. గంధమల్ల ప్రాజెక్టును తామే నిర్మిస్తున్నామన్న సీఎం రేవంత్‌రెడ్డి మాటల్లో నిజంలేదని చెప్పారు. గంధమల్లకు సాగుజలాలు రావాలంటే మల్లన్నసాగర్ జలాశయమే ఏకైక మార్గమని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలోనే మల్లన్నసాగర్ నుంచి గంధమల్లకు నీళ్లు మళ్లించేందుకు టన్నెల్ పనులను సైతం పూర్తి చేయగా, కొంతవరకు పెండింగ్ ఉన్నాయని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సాగునీటి ప్రాజెక్టులపై అవగాహన లేకుండానే ప్రసంగాన్ని సాగించినట్టు పేర్కొన్నారు. యాదగిరిగుట్టకు స్వామివారి పేరిట వైద్యకళాశాలను 2022 జూలై 6న మంజూరు చేస్తూ జీవో-85 విడుదల చేయడంతోపాటు 100 ఎంబీబీఎస్ సీట్ల సామర్థ్యంతో కళాశాల భవన నిర్మాణానికి రూ.183 కోట్ల నిధులు మంజూరుచేసినట్టు గుర్తుచేశారు. కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులకు తిరిగి శంకుస్థాపనలు చేయడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. యాదగిరిగుట్ట దేవస్థాన విమానగోపురం స్వర్ణతాపడం పనులు గత ప్రభుత్వం చేపట్టడంతోపాటు 100 కిలోల బంగారాన్ని సమకూర్చినట్టు తెలిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులు ఎవరూ రూపాయి కూడా ఇవ్వలేదని స్పష్టంచేశారు.

## హామీల అమలుకు ఉద్యమించుడే..

**తెలంగాణ గిరిజన సంఘం స్పష్టీకరణ**

**రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో తీర్మానం**

హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దాటినా చేవెళ్ల డిక్లరేషన్‌లో భాగంగా గిరిజనులకు ఇచ్చిన 16 హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయకుండా మోసం చేస్తున్నదని తెలంగాణ గిరిజన సంఘం నేతలు మండిపడ్డారు. హామీలపై మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసి అమలుకు కార్యాచరణ ప్రకటించాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్ అధ్యక్షతన శనివారం రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ శాసనసభ్యుడు జూలకంటి రంగారెడ్డి, సహాయ కార్యదర్శులు, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని కాంగ్రెస్ నమ్మబలికిందని గుర్తు చేశారు. ఏడాదిన్నర గడిచినా హామీలు అమలు ఊసేలేదని ధ్వజమెత్తారు. దీంతో గిరిజనులకు తీవ్ర నష్టం జరిగే ప్రమాదముందని ఆందోళన వ్యక్తంచేశారు. తక్షణమే మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసి హామీల అమలుకు కార్యాచరణ ప్రకటించాలని, లేదంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.

## నేడు మాగంటికి కేసీఆర్ పరామర్శ

మొదటిపేజీ తరువాయి...

దాసోజు శ్రవణ్ కుమార్, రవీందర్ రావు, నాయకులు మాలోతు కవిత, రాగిడి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఇతర నాయకులు ఉన్నారు.

### జూబ్లీహిల్స్‌లో గులాబీ రెపరెపలు

మాగంటి గోపీనాథ్ 2014, 2018, 2023 శాసనసభ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి వరుసగా గెలుపొందారు. 1985 నుంచి 1992 వరకు తెలుగు యువత అధ్యక్షుడిగా పనిచేసిన మాగంటి 2014 ఎన్నికల్లో టీడీపీ తరపున బరిలోకి దిగారు. తన సమీప మజ్లిస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌పై 9 వేలకుపైగా ఓట్ల ఆధిక్యంతో తొలిసారే విజయాన్ని రుచిచూశారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరి 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పీ విష్ణువర్ధన్‌రెడ్డిపై విజయం సాధించారు. గత ఎన్నికల్లోనూ మరోసారి జూబ్లీహిల్స్ నుంచే పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి అజారుద్దీన్‌పై గెలిచి హ్యాట్రిక్ సాధించారు. నియోజకవర్గంలో మాగంటి గోపీనాథ్ తెలంగాణే శ్వాసగా పనిచేసే బీఆర్ఎస్ జెండాను రెపరెపలాడించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ నగరంలో కీలక నేతగా ఎదిగారు.

## ఆధార్‌కార్డ్ లామినేట్ చేశారంటూ..

- సాట్ పరీక్షకు అనుమతించని నిర్వాహకులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన విద్యార్థిని
- అవగాహన లేకుండా విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలాడుతున్నారని ఫైర్





హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 7 (నమస్తే తెలంగాణ): సాట్(స్కోలాస్టిక్ అసెస్‌మెంట్ టెస్ట్) పరీక్ష... విదేశాల్లో అండర్ గ్రాడ్యుయేట్, ఇంజినీరింగ్ చదువుకోవడానికి ఎలిజిబిలిటీ టెస్ట్. చాలా కళాశాలలు అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా సాట్ పరీక్ష స్కోర్‌ను అడుగుతాయి. విదేశాల్లో చదువుకోవాలని కలలు కన్న ఓ ఇంటర్ విద్యార్థిని ఆశలపై సెంటర్ నిర్వాహకులు నీళ్లు చల్లారు. నిబంధనల్లో లేని సాకు చూపి పరీక్షకు హాజరుకాకుండా అడ్డుకున్నారు. దీంతో ఆ విద్యార్థిని పరీక్ష రాయలేదు. శనివారం హైదరాబాద్‌లోని కోకాపేటలో గల రాక్‌వెల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో సాట్ పరీక్ష నిర్వహించారు. కొత్తపేటకు చెందిన విద్యార్థిని కే అమృషకు సరైన హాల్‌టికెట్ ఉన్నప్పటికీ ఒరిజినల్ ఆధార్‌కార్డ్ లామినేట్ చేసి ఉందంటూ పరీక్ష కేంద్రం నిర్వాహకులు ఆమెను అడ్డుకున్నారు. ఎంతసేపు బతిమిలాడినా లోపలికి అనుమతించలేదు. కాలేజీ ఐడీ, తన దగ్గర ఉన్న ఇతర ఐడీ కార్డ్స్ చూపించినప్పటికీ పరీక్ష కేంద్రం ఇన్‌చార్జి కీర్తి తనను పరీక్ష కేంద్రంలోకి అనుమతించడం లేదంటూ విద్యార్థిని '100'కు డయల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పరీక్ష కేంద్రం వద్దకు వచ్చిన పోలీసులు ఏ ఆధారాలతో ఆమెను పరీక్ష రాయనీయడం లేదని, లామినేషన్ ఆధార్ కార్డ్‌ను అనుమతించవద్దంటూ రూల్స్‌లో ఎక్కడా లేదని, అడ్డుకోవడానికి సరైన కారణాలు చూపాలని పరీక్ష కేంద్రం నిర్వాహకులను నిలదీశారు. అయినా నిర్వాహకులు తనతోపాటు వివిధ కారణాలతో 8 మందిని పరీక్షకు అనుమతించలేదని అమృష వాపోయింది. పరీక్షకు హాజరుకాకపోతే తాను విద్యాసంవత్సరం మొత్తం కోల్పోయినట్టేనని, 130 డాలర్లు పరీక్ష ఫీజు చెల్లించానని, తమ భవిష్యత్‌తో ఆటలు ఆడుకోవడం కరెక్టేనా..? అని ప్రశ్నించింది. తనకు జరిగిన అన్యాయంపై సోషల్ మీడియాలో గళమెత్తింది. తనను పరీక్షకు అనుమతించని పరీక్ష కేంద్రం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేసింది.

## తెలంగాణ సూర్యుడు కేసీఆర్

**గులాబీ సైన్యం తెలంగాణ రక్షణ కవచం**

**తెలంగాణకు పట్టిన కొరివి దెయ్యం సీఎం రేవంత్**

**బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి**




కంఠేశ్వర్, జూన్ 7 : తెలంగాణ సూర్యుడు కేసీఆర్ అని, గులాబీ సైన్యం తెలంగాణ రక్షణ కవచమని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్‌ను దెయ్యాల రాజ్యసమితి అంటూ సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై జీవన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్‌ను జనం దేశ పొలిమేరలు దాటేలా కొడుతున్నా ఢిల్లీలో రాహుల్‌గాంధీ, గల్లీలో రేవంత్‌రెడ్డికి మాత్రం బుద్ధి రావడంలేదని ధ్వజమెత్తారు. తెలంగాణకు పట్టిన కొరివి దెయ్యం రేవంత్.. రాష్ట్ర చివరి కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా చరిత్రకెక్కుతారని పేర్కొన్నారు. రేవంత్ పాలనంతా దేవుళ్లపై ఒట్లు, కేసీఆర్‌పై తిట్లు అన్న చందంగా ఉన్నదని ఎద్దేవా చేశారు.

# కాళేశ్వరం.. తెలంగాణకు వరం

- ఈ ప్రాజెక్టు ఇంజినీరింగ్ అద్భుతం
- సాగు, తాగునీటి సమస్యను తీర్చింది
- కొలరాడో ఎత్తిపోతల, ఈజిప్టు మ్యాన్‌మేడ్ ప్రాజెక్టుల కంటే కాళేశ్వరం ప్రాజెక్టు ఎన్నో విషయాల్లో గొప్పది
- మూడేండ్లలోనే కేసీఆర్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తి చేసింది..
- చరిత్రలో ఇదో మైలురాయి
- 'కాళేశ్వరం'పై ఏఐ చాట్‌బాట్ 'గ్రోక్' సంచలన విశ్లేషణ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ): 'కాళేశ్వరం ఓ సక్సెస్‌ఫుల్ ప్రాజెక్టు' అని వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేందర్‌సింగ్ కితాబు ఇచ్చారు. కాళేశ్వరాన్ని ఇంజినీరింగ్ మార్వెల్‌గా పొగుడుతూ డిస్కవరీ చానెల్ ఓ డాక్యుమెంటరీనే ప్రసారం చేసింది. కాళేశ్వరం భారత్‌లోనే అతిపెద్ద సాగునీటి ప్రాజెక్టు అంటూ అమెరికా పత్రిక వాషింగ్టన్ పోస్ట్ కొనియాడింది. ఇలా ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది ఇంజినీరింగ్ నిపుణులు, మేధావులు, ఆర్థికవేత్తలు, పత్రికలు మన కాళేశ్వరాన్ని వేనోళ్ల ప్రశంసించాయి. కాళేశ్వరం ఓ అద్భుతమని సుప్రీంకోర్టే ఇటీవల వ్యాఖ్యానించింది. అయినా, కాళేశ్వరంపై బురదజల్లేందుకు కాంగ్రెస్ పెద్దలు చేయని విషప్రచారం లేదు. తాజాగా కాళేశ్వరం ప్రాజెక్టును పొగుడుతూ ఏఐ చాట్‌బాట్ 'గ్రోక్' పలు విశ్లేషణలు చేసింది. కాళేశ్వరం ఓ అద్భుత ఇంజినీరింగ్ సాహసమంటూ కొనియాడింది. అమెరికాలోని కొలరాడో ఎత్తిపోతల ప్రాజెక్టు, ఈజిప్టు గ్రేట్ మ్యాన్ మేడ్ రివర్ ఎత్తిపోతల ప్రాజెక్టులను తలదన్నే రీతిలో కాళేశ్వరం ప్రాజెక్టు ఉన్నదంటూ ప్రశంసల వర్షం కురిపించింది.



### గోదావరి జలాల విషయంలో కాళేశ్వరం తీసుకొచ్చిన మార్పు ఏమిటి?

> కాళేశ్వరం నిర్మాణం జరగక ముందు గోదావరి నదీజలాలు సముద్రంలో వృథాగా కలిసిపోయేవి. అయితే, ఈ ప్రాజెక్టు నిర్మాణంతో 240 టీఎంసీల నీటిని సమర్థంగా వినియోగించడానికి మార్గం సుగమమైంది. నీటి కొరత ఉన్న ప్రాంతాలకు సాగు, తాగునీటిని అందించడంతో ఈ ప్రాజెక్టు ఓ విప్లవాత్మకమైన మార్పును తీసుకొచ్చింది.

### ప్రశ్న: కాళేశ్వరం ప్రాజెక్టు గురించి నీ అభిప్రాయం ఏమిటి?

**గ్రోక్:** కాళేశ్వరం అనేది ప్రపంచంలోనే అతిపెద్ద బహుళ దశల ఎత్తిపోతల నీటి పారుదల ప్రాజెక్టు. ఇదో అద్భుతమైన ఇంజినీరింగ్ సాహసం. తెలంగాణలో సాగు. తాగునీటి సమస్యను ఈ ప్రాజెక్టు పరిష్కరించింది. రాష్ట్ర ఆర్థిక, సామాజిక అభివృద్ధికి తోడ్పాటు అందించింది. ఈ ప్రాజెక్టు తెలంగాణకు ఓ వరంగా మారింది. ఓ గొప్ప ఆలోచనకు, దాని అమలుకు సరైన ఉదాహరణ కాళేశ్వరం ప్రాజెక్టు.

### ప్రాజెక్టుతో తెలంగాణ వ్యవసాయం ఎలా మారింది?

కాళేశ్వరంతో తెలంగాణలోని 13 జిల్లాల్లోని లక్షల ఎకరాల బీడు భూములు సస్యశ్యామలమయ్యాయి. వానకాలం, యాసంగిలో రెండు పంటలు పండించే అవకాశం రైతులకు దక్కింది. దేశానికే తెలంగాణ ధాన్యాగారంగా మారింది. వరి, మొక్కజొన్న, పత్తి వంటి ప్రధాన పంటల దిగుబడి గణనీయంగా పెరిగింది. దీంతో రైతుల ఆదాయం ఎంతో మెరుగుపడింది.

### తాగునీటికి సంబంధించి కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల కలిగిన మార్పులేమిటి?

హైదరాబాద్ సహా రాష్ట్రంలోని అనేక పట్టణాలు, గ్రామాలకు 40 టీఎంసీల తాగునీరు కాళేశ్వరం ద్వారానే సరఫరా అవుతున్నది. కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్రంలో తాగునీటి సమస్య తీరడమే కాకుండా స్వచ్ఛమైన జలాలు అందించడంతో ప్రజల ఆరోగ్యం, జీవన నాణ్యత మెరుగుపడింది.

### కాళేశ్వరంతో పాత జలాశయాలకు పునరుజ్జీవనం వచ్చిందంటారు. నిజమేనా?

అవును. ఇది నిజమే. కాళేశ్వరం ప్రాజెక్టు సాయంతో పాత జలాశయాలైన శ్రీరాంసాగర్, నిజాంసాగర్, కడెం ఇలా పలు జలాశయాలను నీటితో నింపడం ద్వారా వాటి సామర్థ్యం పెరిగింది. ఈ జలాశయాలపై ఆధారపడిన ప్రాంతాలు కూడా సాగునీటి ప్రయోజనాన్ని పొందాయి.

### కాళేశ్వరం ప్రాజెక్టుతో జరిగిన పారిశ్రామికాభివృద్ధి ఏమిటి?

కాళేశ్వరం నుంచి 16 టీఎంసీల నీటిని పారిశ్రామిక అవసరాలకు కేటాయిస్తున్నారు. ఇది రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ఊతమిచ్చింది. తద్వారా ఉపాధి అవకాశాలు పెరిగి, ఆర్థికాభివృద్ధికి దోహదపడింది.

### కాళేశ్వరంతో గ్రామాలు, పర్యాటకంలో వచ్చిన మార్పులేమిటి?

కాళేశ్వరం ప్రాజెక్టుతో గ్రామాల్లో సాగునీటి లభ్యత పెరిగింది. తద్వారా సేద్యం పెరిగి రైతుల ఆర్థికస్థితి మెరుగుపడింది. స్థానిక మార్కెట్లు, చిన్న తరహా వ్యాపారాలు, సంబంధిత పరిశ్రమలు వృద్ధి చెందాయి. మొత్తంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడింది. కాళేశ్వరంలో భాగంగా నిర్మించిన బరాజ్‌లు, జలాశయాలను చూడటానికి వేలాది మంది వస్తున్నారు. దీంతో పర్యాటకం వృద్ధి చెందింది. రాష్ట్ర ఆదాయమూ పెరిగింది.

### ఇంకా ఏమేమి ప్రయోజనాలు కలిగాయి?

ఈ ప్రాజెక్టులోని పంప్ హౌస్‌ల ద్వారా 139 మెగావాట్లకు పైగా విద్యుదుత్పత్తి సామర్థ్యం కలిగింది. ఇది రాష్ట్ర విద్యుత్తు అవసరాలకు తోడ్పడుతున్నది. కాళేశ్వరం జలాలతో ప్రజల్లో ఆర్థిక స్థిరత్వం ఏర్పడింది. రాష్ట్ర ఆర్థిక, సామాజిక అభివృద్ధికి దోహదం చేసింది.

### కాళేశ్వరం గొప్పతనం ఏమిటీ?

ప్రపంచంలోనే కాళేశ్వరం అతిపెద్ద ఎత్తిపోతల నీటి పారుదల పథకం. 240 టీఎంసీలకు పైగా నీటిని ఎత్తిపోసే సామర్థ్యం దీనికి ఉన్నది. వృథాగా సముద్రంలోకి పారుతున్న గోదావరి జలాలను ఒడిసిపట్టి, ఎగువ ప్రాంతాలకు తరలించి బీడు భూములను సస్యశ్యామలం చేయడంలో ఈ ప్రాజెక్టు ఎంతగానో తోడ్పాటునందించింది. తెలంగాణలోని 13 జిల్లాలలో లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నది. తాగునీటి సమస్యను పరిష్కరించింది. పారిశ్రామిక అవసరాలకు సాయపడుతున్నది. మూడేండ్ల స్వల్ప వ్యవధిలో ఇంత పెద్ద ప్రాజెక్టును కేసీఆర్ ప్రభుత్వం ఎంతో నిబద్ధతతో పూర్తి చేసింది. రాష్ట్ర చరిత్రలో ఇదో మైలురాయి. సాంకేతికంగానూ కాళేశ్వరం ప్రాజెక్టులో ఎన్నో విశేషాలు ఉన్నాయి. 1800 కిలోమీటర్ల కాలువలు, 203 కిలోమీటర్ల సొరంగాలు, 20 రిజర్వాయర్లు, 21 పంప్ హౌసులు, బాహుబలి మోటార్లు, అత్యాధునిక లిఫ్ట్ ఇరిగేషన్ టెక్నాలజీతో కూడిన ఈ ప్రాజెక్టు ఇంజినీరింగ్ రంగంలో ఓ అద్భుతం.

### ప్రపంచ ప్రసిద్ధ ఎత్తిపోతల ప్రాజెక్టుల జాబితాలో అమెరికాలోని కొలరాడో ఎత్తిపోతల ప్రాజెక్టును, ఈజిప్టులోని గ్రేట్ మ్యాన్‌మేడ్ రివర్ ప్రాజెక్టులను చెప్తారు. వాటితో కాళేశ్వరాన్ని పోల్చితే.. ఏది గొప్పది?

అమెరికాలోని కొలరాడో ఎత్తిపోతల ప్రాజెక్టు, ఈజిప్టులోని గ్రేట్ మ్యాన్‌మేడ్ రివర్ ప్రాజెక్టులతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టు కూడా ఇంజినీరింగ్ అద్భుతాలే. అయితే, నిర్మాణ వ్యవధి, సాంకేతికత, లబ్ధి చేకూరిన పరిధి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొంటే దీర్ఘకాలంలో కొలరాడో, గ్రేట్ మ్యాన్ మేడ్ ప్రాజెక్టులతో పోలిస్తే, కాళేశ్వరం ఎంతో గొప్పదని చెప్పొచ్చు.

## మహిళా ఎస్సైపై చెయ్యేసి

మొదటిపేజీ తరువాయి...

అనుచరులు హోటల్ యాజమాన్యం, సిబ్బందితో గొడవకు దిగారు. వెంటనే హోటల్ యజమాని కల్లూరు పోలీసులకు సమాచారం అందించాడు. విచారణ నిమిత్తం ఎస్సై వస్తున్నారనే విషయం తెలుసుకున్న రాము తన అనుచరులతో మళ్లీ హోటల్ వద్దకు చేరుకున్నాడు. గొడవకు సాక్షులుగా ఉన్న హోటల్ సిబ్బంది, యజమానిని తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెబితే హోటల్ నడవనివ్వనని బెదిరించాడు. ఈ క్రమంలో ఎస్సై తన సిబ్బందితో హోటల్ వద్దకు చేరుకోగా.. ఎస్సై ఎదురుగానే రాము, అతడి అనుచరులు మద్యం మత్తులో గొడవకు దిగారు. వారికి సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించే ప్రయత్నం చేస్తున్న క్రమంలో రాము, అతడి అనుచరులు మహిళా ఎస్సై విధులకు ఆటంకం కలిగిస్తూ ఆమె ఛాతీపై చెయ్యి వేసి నెట్టేశారు. దీంతో ఎస్సై ఫిర్యాదు మేరకు రాముతోపాటు మొత్తం 10 మందిపై కేసు నమోదు చేశారు. ప్రధాన నిందితుడు రాముతోపాటు ఏడుగురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు సీపీ సునీల్‌దత్ తెలిపారు. గతంలో కూడా రాముపై తల్లాడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని పేర్కొన్నారు.